క్లుప్తంగా

అన్నదానం



హిమవర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్న దాతలు

కడప అర్బన్: వైఎస్‌ఆర్ జిల్లా గోటూరు వాసులు చావలి ముని సుబ్బయ్య వర్ధంతి సందర్భంగా వీరి కుమారుడు చావలి ఆంజనేయులు కోడలు వనిత హిమ వర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు గుండ్ల కొండ విజయలక్ష్మి, ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్ల కొండ రవి, వెంకట సురేష్ బాబు, దామోదర్, ఎలక్ట్రిషన్ మధు, ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాస్ రెడ్డి, దాతలు పాల్గొన్నారు.

పోస్టల్ ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 31 నుంచి జూన్ 4 లోపల పోస్టల్ ఖాతాదారులు తమ ఖాతాలకు ఆధార్‌తో బ్యాంకు ఖాతాలకు అనుసంధానం చేసుకోవడం కోసం ఎన్‌పిసిఐ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు కడప విడివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు బదిలీ కోసం ఖాతాదారులు ఆధార్‌తో బ్యాంకు ఖాతాలను అనుసంధానం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో సుమారు 51 లక్షల మంది బ్యాంకు ఖాతాలు సీడింగ్ లేని కారణంగా తమ శాఖ ఆధ్వర్యంలో గత ఏడాది స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. పోస్టల్ శాఖ, సచివాలయ సిబ్బంది, రాష్ట్ర ప్రభుత్వాధికారుల సమన్వయంతో జూన్ 5 లోగా ఆధార్ సీడింగ్ ఎన్‌పీసీఐ లింకేజీ తెరవడంతో పాటు వారికి నూతన పోస్టల్ బ్యాంకింగ్ ఖాతాలను తెరవనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాస్టర్ల సమస్యలను పరిష్కరించండి

కడప కల్చరల్ : కడప నగరంలోని దైవజనులైన పాస్టర్ల సమస్యలను పరిష్కరించాలని పాస్టర్ పి.మహేష్ కోరారు. సోమవారం న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ చర్చిలో ఆయన సిస్టర్ శాంతమ్మతో కలిసి సమస్యలు గురించి వినతించారు. మహానాడుకు వస్తున్న సీఎం చంద్రబాబు పాస్టర్ల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని, క్రైస్తవులకు సూపర్ సిక్స్ లో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కాగా పాస్టర్లకు 7 నెలల గౌరవవేతనం మాత్రమే అందిందన్నారు. పాస్టర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, గౌరవ వేతనం కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు అర్హులైన పాస్టర్లకు ఆన్‌లైన్ సౌకర్యం కల్పించాలన్నారు. పాస్టర్లపై దాడులు జరగకుండా ప్రభుత్వం చొరవతీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పి.రవితేజ, శాంతిరాజు, రోజా, నరసయ్య, సరళ, అశోక్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలేవీ?

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలను పాటించని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏ.ఐ.ఎస్.బి జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం ఓం శాంతి నగర్ లోని ఏ.ఐ.ఎస్.బి జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా చాలా ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు ఇంటర్నేషనల్, టెక్నో, ఇ-టెక్నో, ఒలంపియాడ్, కాన్సెప్ట్, ఐఐటి, సైనిక్ వంటి పేర్లతో ప్రచారాలు నిర్వహిస్తూ వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నా కూడా జిల్లా విద్యాశాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కొత్త కొత్త పేర్లతో ప్రచారం చేస్తూ అడ్మిషన్లు నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఏ.ఐ.ఎస్.బి జిల్లా నాయకులు అజ్మతుల్లా, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను ఆధునికీకరిస్తాం

– రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జి.కోటేశ్వరరావు



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

కడప కల్చరల్ : రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలను ఆధునీకరించనున్నామని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జి.కోటేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన కడప నగరంలోని కేంద్ర గ్రంథాలయ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఓం శాంతి నగర్ లోని మహిళా గ్రంథాలయాన్ని పరిశీలించారు. నూతన భవన నిర్మాణానికి ప్రస్తుతం కోటి రూపాయలు నిధులు విడుదల చేశామని, పాఠకుల కోసం కావలసిన అని సౌకర్యాలతో నూతన భవన ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. గ్రంథాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశాలకు ఇచ్చిన హామీలపై జీఓలు ఇవ్వాలి

– కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలకు సంబంధించి తక్షణమే జీఓలు విడుదల చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు, మహిళా దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పలు హామీలు ఇచ్చారన్నారు. గ్రాట్యూటీ రూ. 1.50 లక్షలు, రిటైర్డ్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంపు, 180 రోజులు చొప్పున రెండు కాన్పులకు వేతనంతో కూడిన మెటర్నటీ సెలవులు ఇస్తామని ప్రకటించి ఇంతవరకు జీఓలు జారీ చేయలేదని విమర్శించారు. జీఓలు రాకపోవడంతో ఈనెలలో చాలా మంది ఆశా వర్కర్లు రిటైర్డ్‌మెంట్ అవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన బెనిఫిట్స్ కూడా ఆశా వర్కర్లకు అందకపోవడం బాధాకరమన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జి.వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోవడం అన్యాయమని విమర్శించారు. వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికల సందర్భంగా కూటమి నేతలు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న లెప్రసీ అలవెన్సు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు శాంతమ్మ, అమ్ములు, అనసూయ, పద్మావతి, నాగలక్ష్మి, సరస్వతి పాల్గొన్నారు.

మహానాడులో కడప ఉక్కుపై స్పష్టత ఇవ్వాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్/ కడప ఎడ్యుకేషన్: కడప వేదికగా మహానాడు జరుగుతున్న సందర్భంలో కడప ఉక్కుపై తెలుగుదేశం ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. సోమవారం నగరంలోని డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కడప ఉక్కు పైన కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. విభజన హామీల ప్రధాన హక్కు అయిన కడప ఉక్కుని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించిందని, ఇక్కడ ప్రాంత యువతను మోసం చేసిందన్నారు. కడప ఉక్కు పరిశ్రమ వస్తే వేలాది మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఉదయ్ మా బాష పాల్గొన్నారు.

– కడపలో టీడీపీ మహానాడు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజల ఆకాంక్ష కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు పెద్దుల్లపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ఏఐవైఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరువుతో తల్లడిల్లుతున్న రాయలసీమ కేంద్ర బిందువు కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

జిల్లాలోని పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలో నెలకొన్న పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గంలోని సగిలేరు ప్రాజెక్టు ద్వారా బద్వేల్ చెరువు కు నీరు చేరేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సోమశిల లిఫ్ట్ ప్రాజెక్ట్ ద్వారా 1 టీఎంసీ నీరు బద్వేల్ చెరువు కు అందించాలన్నారు. జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ పనులను తక్షణమే ప్రారంభించాలన్నారు. మైలవరం టెక్స్‌టైల్స్ పార్క్‌ను ప్రారంభించాలన్నారు. పలు పెండింగ్ నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. కడప విమానాశ్రయంలో నైట్ ల్యాండింగ్‌కు అనుమతి ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, కదిరి ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి పల్లకి సేవ

చాపాడు: మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి దేవస్థాన సన్నిధిలో సోమవారం వీరభద్ర స్వామి, భద్రకాళిమాత ఉత్సవ మూర్తుల పల్లకి సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఆలయం వద్ద భద్రకాళి సమేత వీరభద్రస్వామి అన్నదాన సత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్, మాజీ జెడ్పీటీసీ మేకల బాబు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీ రుణాలకు సబ్సిడీ విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : మంజూరైన బీసీ రుణాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సబ్సిడీ విడుదల చేయాలని, మంజూరు కాని రుణాలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా జరిగింది. ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేశు యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల పేద బీసీ కులాల వారికి ప్రకటించిన సబ్సిడీ రుణాలు జనాభాకు తగ్గట్టు లేవని విమర్శించారు. ప్రకటించిన రుణాలు కొన్నే అయినప్పటికీ ఇంతవరకు సబ్సిడీ మంజూరు చేయకుండా కాలయాపన చేయడం తగదన్నారు. జిల్లాలో సుమారు 1650 మంది లబ్ధిదారులు ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకు వీరికి రుణాలు మంజూరు కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రుణాలు మంజూరు చేసి వారి జీవనోపాధికి దోహదపడాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున, రాయలసీమ ఎస్సీ ఎస్టీ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ ఫోరం కన్వీనర్ జేవీ రమణ, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మనోహర్, గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ ఆంజనేయులు, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గుర్రప్ప, సీహెచ్‌ఆర్‌డీ అధ్యక్షులు శివారెడ్డి, ఏపీ దళిత మిత్ర సంఘం నాయకుడు బాబు, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డబ్ల్యు రాము, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రాన్ని సమర్పించారు.

కలెక్టరేట్ ఎదుట హెచ్‌పీసీఎల్ ట్రాన్స్‌పోర్టర్ల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ట్రాన్స్‌పోర్టర్ల సంఘం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : తమ డిమాండ్ల సాధన కోసం హెచ్‌పీసీఎల్ ట్రాన్స్‌పోర్టర్ల సంఘం నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ కడప హెచ్‌పీసీఎల్ భాకరాపేట టెర్మినల్‌లో స్థానిక ట్రాన్స్‌పోర్టర్లకే మొదటి అవకాశం కల్పించాలని కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న ట్రాన్స్‌పోర్టర్లకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌పోర్టర్ల చట్టాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు. చెన్నై మాఫియాను కట్టడి చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ బినామీలపై చర్యలు చేపట్టాలన్నారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి ఎస్.రవిశంకర్‌రెడ్డి, సీహెచ్‌ఆర్‌డీ అధ్యక్షులు పి.శివారెడ్డి, వివిధ ప్రజా సంఘాల నాయకులు జి.గోపాల్, గుర్రప్ప తదితరులు మద్దతు ప్రకటించారు.

కలెక్టరేట్, న్యాయస్థానాలకు ఇలాగే కడతారా...!

అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ జెండాలు కట్టడంపై మాల మహానాడు నిరసన

కడప కార్పొరేషన్: భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహం చుట్టూ తెలుగుదేశం పార్టీ జెండాలు కట్టి ఆయన్ను అవమానించడం దారుణమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపల్లి వినోద్ కుమార్ అన్నారు. సోమవారం అంబేడ్కర్ సర్కిల్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారమే దేశంలో, రాష్ట్రంలో పాలన నడుస్తోందని, రాజ్యాంగాన్ని అనుసరించే న్యాయస్థానాలు తీర్పులను ఇస్తున్నాయన్నారు. అలాంటి అంబేడ్కర్ విగ్రహానికి ఒక పార్టీకి సంబంధించిన జెండాలు కట్టి పసుపుమయం చేయడం దారుణమన్నారు. జిల్లా కలెక్టరేట్, జిల్లా న్యాయస్థానాలకు ఇలాగే ఒక పార్టీ జెండాలు కడతారా అని వారు సూటిగా ప్రశ్నించారు. వెంటనే కట్టిన జెండాలను తొలగింపజేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్, నగరపాలక కమిషనర్‌కు వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు.

పచ్చనేతల పిచ్చి ముదిరింది..

మహానాడు సందర్భంగా పచ్చనేతల పిచ్చి ముదిరిందని సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్ కుమార్ ఒక ప్రకటనలో విమర్శించారు. కడప మొత్తం ఎటువంటి అనుమతులు లేకుండా ఫ్లెక్సీలతో నింపిన టీడీపీ నాయకులు, మహనీయులు, పురాణ పురుషుల విగ్రహ కూడళ్లను సైతం టీడీపీ జెండాలు, తోరణాలతో అలంకరించడం దారుణమన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ కూడలి, వై జంక్షన్ లోని మన దేశ జాతీయ చిహ్నం అయిన అశోక చక్ర కూడలిని సైతం టీడీపీ జెండాలతో నింపడం పట్ల ప్రజలు విస్తుపోతున్నారన్నారు. రాజ్యాంగ నిర్మాతను, మన దేశ చిహ్నాన్ని అగౌరపరిచేలా తెలుగు దేశం నాయకులు వ్యవహరించడం దారుణమన్నారు.ఆ జెండాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

జాతి నేతల విగ్రహాలకు టీడీపీ జెండాలా..?





టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు నేపథ్యంలో జాతి నేతల విగ్రహాల వద్ద పసుపుమయం చేశారు. వీధులలో ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టారు. అది కాదని నగరంలోని జాతిపిత గాంధీ కూడలిలో, ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు విగ్రహం వద్ద పచ్చతోరణాలు కట్టారు. ఇవి చూసిన ప్రజలు ఇదేమి పచ్చపైత్యం అని చర్చించుకున్నారు. – ఫొటోలు: సాక్షిఫొటోగ్రాఫర్, కడప

లైసెన్స్ పట్టు.. ఉద్యోగం కొట్టు

- హెవీ లైసెన్స్‌తో పుష్కలంగా ఉపాధి
- 25వ బ్యాచ్‌కు డ్రైవింగ్ స్కూలులో శిక్షణ పూర్తి
- సర్టిఫికెట్లను అందజేసిన డీఎం



శిక్షణ పూర్తి చేసుకున్న వారితో కడప డీఎం డిల్లీశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : మనిషి జేబులో హెవీ లైసెన్స్ ఉంటే చేతిలో డ్రైవర్ ఉద్యోగం ఉన్నట్లే భావించాలి. కడప డిపోలో డ్రైవింగ్ స్కూలులో శిక్షణ పూర్తి చేసుకున్న 25వ బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సోమవారం కడప డీఎం డిల్లీశ్వరరావు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్రువపత్రాలను ఆర్టీఓ కార్యాలయంలో సమర్పిస్తే హెవీ డ్రైవింగ్ సర్టిఫికెట్లను ఇస్తారన్నారు.

జిల్లాలో ఏకైక డ్రైవింగ్ స్కూలు

కడపలో 2020 ఆగస్టు 5న హెవీ డ్రైవింగ్ స్కూలును ప్రారంభించారు. ఏపీఎస్ ఆర్టీసీ ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి డ్రైవింగ్ స్కూలును ఏర్పాటు చేసింది. ఒక్కో బ్యాచ్‌లో 16 మంది చొప్పున ఇప్పటివరకు 25 బ్యాచ్‌లలో 400 మందికి శిక్షణ ఇవ్వడంతోపాటు సర్టిఫికెట్లను అందజేశారు. ఇందులో 50 శాతం మందికి స్థానికంగా ఎలక్ట్రిక్ బస్సులు, ఆర్టీసీ గ్యారేజీలో, స్కూలు బస్సు డ్రైవర్లుగా, పలు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు లభించాయి. సాధారణంగా హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు, శిక్షణ తీసుకునేందుకు పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది.


నేటి నుంచి శిక్షణ ప్రారంభం

26వ బ్యాచ్‌కు మంగళవారం నుంచి శిక్షణ ప్రారంభిస్తున్నామని ఆర్టీసీ కడప డీఎం డిల్లీశ్వరరావు తెలిపారు. శిక్షణ తీసుకునేందుకు ఆసక్తిగల వారు తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు. ఇతర వివరాలకు 7382865145 నెంబరులో సంప్రదించాలన్నారు.

గత వైఎస్సార్‌సీపీ సర్కార్ పునాది..


గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2020, ఆగస్టులో ఒక్కో హెవీ డ్రైవింగ్ లైసెన్స్ శిక్షణ స్కూలును నామమాత్రపు ఫీజుతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారు. ఆయన వేసిన పునాదితో హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌లో శిక్షణ పొందుతుండడం విశేషం. ఇప్పటివరకు 400 మందికి పైగా హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌ను సులభంగా పొంది ఉద్యోగాలు చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును యువ డ్రైవర్లు గుర్తు చేసుకుంటున్నారు.

400 మందికి శిక్షణ ఇచ్చాను




ఏపీఎస్ ఆర్టీసీలో హెవీ డ్రైవింగ్ స్కూలు కడపలో ప్రారంభించారు. ఇప్పటివరకు 25 బ్యాచ్‌ల ద్వారా బ్యాచ్‌కు 16 మంది చొప్పున 400 మందికి శిక్షణ ఇచ్చాం. 4, 8వ బ్యాచ్‌లో ఇద్దరు మహిళలకు, 6, 7, 8, 9 బ్యాచ్‌లలో అగ్నిమాపక సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. ప్రస్తుతం 26వ బ్యాచ్‌కు అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఆసక్తి గల వారు కడప డీఎం కార్యాలయంలో సంప్రదించాలి. – షేక్ అబ్దుల్ జబ్బార్, హెవీ డ్రైవింగ్ స్కూలు ట్రైనర్, కడప

శిక్షణ బాగుంది



నా పేరు భాస్కర్ నాయక్. నేను ఒక ఆటో నడుపుతుండేవాడిని. ఏపీఎస్ ఆర్టీసీ వారు హెవీ డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నారని తెలుసుకుని శిక్షణ తీసుకున్నాను. శిక్షణలో ప్రయాణికులను ఎలా గౌరవించాలి, సురక్షితంగా ఎలా గమ్యస్థానాలకు చేర్చాలి? సమయపాలన పాటిస్తూ మైలేజీని ఏ విధంగా తీసుకు రావాలో మెలకువలతో కూడిన శిక్షణ ఇచ్చారు.

వైఎస్ జగన్‌కు రుణపడి ఉన్నాం



నాపేరు వి.జ్ఞానేశ్వరరెడ్డి. మాది కడప. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో ఏపీఎస్ ఆర్టీసీలో అతి తక్కువ ఫీజుతో డ్రైవింగ్ స్కూలును ఏర్పాటు చేశారు. ఇక్కడి శిక్షణలో నేర్పించే టెక్నికల్ అంశాలు, నిబంధనలు, మోటారు వెహికల్ యాక్టు, సేఫ్టీ డ్రైవింగ్ అంశాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. విలువైన శిక్షణ ఇచ్చేందుకు కారణమైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉన్నాం.

తైక్వాండో శిక్షణతో ఆత్మస్థైర్యం



కలర్ బెల్ట్‌లను అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం విజయలక్ష్మి, ఇలియాస్‌బాష

కడప ఎడ్యుకేషన్: ఆత్మరక్షణ, క్రమశిక్షణ, స్వీయ నియంత్రణ తైక్వాండో శిక్షణతోనే సాధ్యమని నగర పాలక ఉర్దూ మెయిన్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అన్నారు. సోమవారం కడప నగరపాలక ఉర్దూ మెయిన్ పాఠశాలలో తైక్వాండో కోచ్‌లు షేక్ ఇర్ఫాన్, షేక్ రుక్సానాల అధ్యక్షతన తైక్వాండో శిక్షణలో ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులకు కలర్ బెల్ట్స్ ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు యస్.యం.డి. ఇలియాస్ బాషాలు పాల్గొని మాట్లాడుతూ.. × ప్రతి సంవత్సరం కడప పట్టణంలో తైక్వాండోలో విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కోచ్‌లు ఇర్ఫాన్, రుక్సానా ల కృషి అభినందనీయమన్నారు. తైక్వాండో శిక్షణ వలన విద్యార్థులలో బలం , చురుకుదనం, వేగం, సమన్వయ అభివృద్ధి తో పాటు ఆత్మరక్షణ కళ కూడా అభివృద్ధి చెందుతుందని అన్నారు. నేడు ఎక్కువ మంది విద్యార్థులు శారీరక శ్రమకు దూరంగా ఉంటూ సెల్ ఫోన్ ఆటలకు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి ఆటల్లో పాల్గొని శరీర దృఢత్వాన్ని కలిగి ఉండాలని తెలిపారు. తైక్వాండో శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలర్ బెల్ట్స్‌లను బహుకరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్ టి యు ప్రొద్దుటూరు రీజియన్ కన్వీనర్ సలీం పాల్గొన్నారు.

బాధితులకు ఆసరా



బాధితులకు సామగ్రిని అందజేస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ నిర్వాహకులు

కడప కల్చరల్: కడప నగరానికి చెందిన వృద్ధురాలికి స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ ఆసరాగా నిలిచిందని సంస్థ కార్యదర్శి సురేష్ తెలిపారు. ఇటీవల జరిగిన సంఘటనలో భాగంగా ఆ వృద్ధురాలి ఇల్లు కూల్చివేశారని, ఏ ఆధారం లేక రోడ్డున పడడంతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆ కుటుంబానికి ఆధారంగా నిలిచారన్నారు. బాధితురాలికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు రూ.30 వేలు విలువ చేసే ఫ్యామిలీ టెంట్‌తోపాటు, 5 వేలు కిచెన్ సెట్ అందజేశామన్నారు. ఆమె సమస్య పట్ల స్పందించిన తాము సంఘటనపై విచారణ చేయాలని రెడ్ క్రాస్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సుధాకర్ ను ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ యశస్విని, జిల్లా సమన్వయకర్త సుధాకర్, ల్యాబ్ టెక్నీషియన్లు స్వరూపరాణి, ప్రశాంతి, సిబ్బంది తోపాటు ప్రజాసంఘాల నాయకులు వెంకట శివ, మద్దిలేటి, భాగ్యలక్ష్మి, తస్లీమా శంకర్ నాయక్, బాధితురాలి కుమారుడు వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీపై విశ్వాసానికి ఇది ప్రతీక



మాట్లాడుతున్న కడప ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ జీకేఆర్‌వీ రవికుమార్

కడప కల్చరల్ : జీవిత బీమా సంస్థపై ఏజెంట్లు, సిబ్బంది, కస్టమర్లకుగల విశ్వాసానికి ఇటీవల జరిగిన సంఘటన ప్రతీకగా నిలుస్తున్నదని ఎల్ఐసీ కడప డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ జీకేఆర్‌వీ రవికుమార్ అన్నారు. స్థానిక ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయ ఆవరణలో గిన్నిస్ రికార్డు బ్యానర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2025 జనవరి 20న ఒక్కరోజులో అత్యధిక పాలసీలు సేకరించిన జీవిత బీమా సంస్థగా ప్రపంచ రికార్డు సాధించిందన్నారు. ఇది ఎల్ఐసి ఏజెంట్ల సత్తాకు, సిబ్బంది నిబద్ధతకు, కస్టమర్ల నమ్మకానికి ప్రతీక అన్నారు. దేశంలో, ప్రపంచంలో ఎన్నో జీవిత బీమా సంస్థలు ఉన్నప్పటికీ, ఎల్ఐసి మాత్రమే చైర్ పర్సన్ సిద్ధార్థ మహంతి పిలుపు మేరకు ఈ అరుదైన సంచలనాన్ని సృష్టించడం గర్వకారణంగా భావిస్తున్నామన్నారు. ఆరోజు దేశవ్యాప్తంగా 4,52,839 మంది ఏజెంట్లు 5,88,107 పాలసీలు సేకరించడంతో ఈ అపూర్వమైన రికార్డు సృష్టించడం సాధ్యమైందని అన్నారు. ఈ గిన్నిస్ రికార్డుకు సంబంధించిన ధ్రువపత్రాన్ని ఆ సంస్థ ప్రతినిధులు మే 24న ముంబైలో ఎల్ఐసీ సీఈవో సిద్ధార్థ మహంతికి అందజేశారని తెలిపారు. సాధించిన దానితో సంతృప్తి చెందకుండా కస్టమర్లకు మరింత అంకితభావంతో సేవలందించాలని, కడప డివిజన్ మరిన్ని రికార్డులు సాధించే దిశగా ఈ ఆర్థిక సంవత్సరంలో పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్లు సత్యప్రసాద్, సత్య శ్రీనివాస్, చంద్రకళ, మేనేజర్లు సాల్మన్ రాజు, వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

సిద్దవటం : సిద్దవటం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 28వ తేదీన(రేపు)జరుగుతుందని ఎంపీడీఓ ఫణిరాజకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన ఉదయం 10.00 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల పనితీరుపై చర్చ చేయనున్నట్లు పేర్కొన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పారు.